అందరి కళ్ళూ ఆయన్నే గమనిస్తున్నాయి. చేతి సంచీలోంచి కాగితాలని తీసి మెజిస్ట్రేట్‌కి అందించి చెప్పాడాయన.

"పందొమ్మిది వందల యాభై నాలుగులో నేను విజయవాడలో పి. డబ్ల్యు. డి. లో పని చేస్తుండగా, ఎనిమిదివందలు లంచం తీసుకున్నాను ఇందులో భాగస్వామ్యం మా సూపరింటెండెంట్‌కి కూడా వుంది కాని ఆయన మరణించి నాలుగేళ్ళయింది, లంచం తీసుకున్న నేరానికి నన్ను శిక్షించవలసిందిగా కోరుతున్నాను. ఈ సంగతి రుజువు చేసే కాగితాలు అవి."

మెజిస్ట్రేట్ కాగితాలు పరిశీలించి ఆశ్చర్యంగా అడిగాడు

"ఇన్నేళ్ళ తర్వాత మీలో ఈ ధర్మబుద్ధి ఎలా కలిగింది?"

"మొన్ననే రిటైరయ్యా" పొడిగా చెప్పాడాయన

"జైల్లో వుంటే భోజనం దొరుకుతుందనా?" అడిగాడు అడ్వకేట్.

ఆయన తల అడ్డంగా ఆడించి చెప్పాడు దిగులుగా

"నా భార్య, తొమ్మిది మంది పిల్లలతో ఆ ఇంటో గడిపే కంటే జైలే మంచి చోటు."

# మీ వుద్యోగం వద్దు

సారంగపాణి ఇంటర్వ్యూలకి పిలిచిన అభ్యర్థుల జాబితాలని తిరగేసాడు. ఆరో అభ్యర్థి పేరు అతన్ని ఆకర్షించింది.

డబ్ల్యు. కె. వి. చలపతి.

ఈ సారి అతన్ని అడగల్సిన ప్రశ్నలు ఎన్నో అన్నీ మనసులో నోటు చేసుకున్నాడు.

పదకొండున్నరకి ఇంటర్వ్యూ మొదలయింది. ఫుడ్ టెక్నాలజీ చేసి, వివిధ కంపెనీల్లో పని చేసే అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్నారు. "సారంగపాణి ఫుడ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మెన్ సారంగపాణి".

ఆయనకి ఇండియా అంతటా పదహారు చోట్ల రకరకాల ఆహార సామాగ్రిని తయారు చేసే కంపెనీలున్నాయి. బొంబేలో సాఫ్ట్‌డ్రింక్స్ యూనిట్, ఢిల్లీ లో పళ్ళరసాల తయారు చేసే యూనిట్, హైదరాబాద్‌లో పచ్చళ్ళ తయారుచేసే యూనిట్, కలకత్తాలా జామ్స్ తయారుచేసే యూనిట్ ఇలా అనేక చోట్ల అనేక యూనట్లని నెల కొల్పాడు సారంగపాణి. పదేళ్ళలో పదహారు యూనిట్స్ స్థాపించి, ప్రస్తుతం త్రివేంద్రంలోబేకరీస్ యూనిట్‌ని స్థాపించ బోతున్నారు.

ఫ్యాక్టరీలో పనిచేయడానికి కావలసిన ఫుడ్ టెక్నాలజిస్ట్‌లని ఎన్నుకోడానికి నెలన్నర క్రితం దరఖాస్తులు కోరుతూ పేపర్‌లో ప్రకటించారు. ఎనిమిది మంది అభ్యర్థులని ఎన్నికే చేసారు ఇంటర్‌వ్యూకి.

మొదటి అభ్యర్థి, మూడో అభ్యర్థి న్యూట్రిషన్ లేబ్‌లో మిగతా వాళ్ళు వివిధ ఫుడ్ ఇండస్ట్రీలలో పని చేస్తున్నారు.

డబ్ల్యు. కె. వి. చలపతి వంతు వచ్చింది. అతను కూర్చున్నాక అడిగాడు సారంగపాణి.

"మీకు బేకరీస్‌లో అనుభవం ఉందా!"

"ఉంది సార్" చెప్పాడు చలపతి.

"క్రంబ్స్ అంటే ఏమిటి! స్టాండర్డ్ లోక్స్ అంటే చెప్పగలరా?"

"బ్రెడ్ తయారయాక వినియోగదార్ల సౌకర్యంకోసం ముక్కలుగా కోయబడుతుంది. బ్రెడ్స్‌ని అలా స్లయిసెస్‌గా చేసేటప్పుడు రాసే పొడిని "క్రంబ్స్" గా వ్యవహరిస్తారు. స్టాండర్డ్‌లోక్స్ అంటే...."

"ఇది వరకు మిమ్మల్ని ఎక్కడో చూసినట్టుంది. నన్ను గుర్తు పట్టగలరా"

"లేదు సార్"

"సంవత్సరం క్రితం కలకత్తాలో మిమ్మల్ని ఇంటర్వ్యూ చేసాను. మా కేన్డ్ ప్రోడక్ట్స్ డివిజన్‌కి. ఏమేవ కరెక్ట్!"

"కరక్ట్ సార్"

"అంతకు మునుపు చండీఘర్‌లోని మా ఫ్లేవర్డ్ మిల్క్ డివిజన్‌కి కూడా మీరు ఇంటర్వ్యూకి వచ్చినట్లు గుర్తు."

"వచ్చాను సార్"

సారంగపాణి ఆలోచనగా చూస్తూ అడిగాడు.

"నాకు గుర్తున్నంతమటుకు మిమ్మల్ని ఎన్నిక చేసాం. ఆర్డర్ పంపినా మీరు వచ్చి చేరలేదు."

చలపతి మవునంగా వుండిపోయాడు, ఓసారి అతని అప్లికేషన్ తిరగేసి చెప్పాడు సారంగపాణి.

"మీ ప్రస్తుత జీతంకన్నా ఎక్కువ జీతమే ఆఫర్ చేసాం రెండు సార్లు. పైగా కలకత్తాలో క్వార్టర్ సౌకర్యం కూడావుంది. ఎందుకు మరి మీరు మాఆఫర్‌ని అంగీకరించలేదో తెలుసుకోవచ్చా!"

డబ్ల్యూ కె. వి. చలపతి మొహం పాలిపోవడం గమనించాడు సారంగపాణి వెంటనే జవాబు చెప్పలేదు.

"మీరు పనిచేసేది కేంద్ర ప్రభుత్వ సంస్థలో మా ఆఫర్‌ని చూపించి వెళ్ళిపోతానని బెదిరించి, జీతం పెంచమని బేరం పెట్టే అవకాశం అక్కడ మీకు లేదు మీరెందుకు తిరస్కరించారు.... తెలుసుకోవాలని ఆసక్తి అంతే చెప్పండి."

"ఏవో కుటుంబ సమస్యలు సార్. ఈసారి తప్పకుండా చేరతాను. ఇప్పుడవి తీరిపోతాయి"

"ఇంక ప్రశ్నలు లేవు. యూ ఆర్ సెలెక్టెడ్."

"ఐలైక్ యూసర్"

సారంగపాణి డబ్ల్యు. కె. వి. చలపతికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ పంపాడు. ఈసారికూడా చలపతి వచ్చి చేరలేదు. ఓ ఉత్తరం రాసాడు.

హైదరాబాద్.
10_3_84.

సర్,

భారత దేశం చూడాలనే కోరికతో, ఇదివరలో నేను చూడని ప్రదేశంనించి ప్రకటనలువస్తే అప్లికేషన్ పంపటం అలవాటు. రానుపోను రైలుచార్జీలు ఇంటర్వ్యూకి పిలిచిన వాళ్ళు ఇవ్వటం. అనవాయితీ మన దేశంలో. ఆ కంపెనీ ఖర్చుతో ఇంటర్వ్యూకి హాజరయి ఆ ఊరు చూసి వెళ్ళడమే నా అభిమతం. సార్ హైద్రాబాద్ వదలి వేరేచోట ఉద్యోగం చేసే ప్రసక్తే లేదు

యువర్స్ సిన్సియర్లీ,

డబ్ల్యు కె. వి. చలపతి.

నోట్:- ఇక మీ కంపెనీ ప్రకటనలకి అప్లికేషన్స్ పంపను.

## మెరిట్ సర్టిఫికెట్

ఆ రోజు రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చాడు చౌడేశ్వరరావు. తలుపు తీసిన తల్లికి గుప్పుమని కొట్టింది ఆల్కహాల్ వాసన. కొడుకు పార్టీకి వెళ్ళి వస్తున్నాడని గ్రహించింది. అతను త్రాగి వచ్చినప్పుడల్లా ఆరోగ్యం పాడవుతోందని బాధపడుతుంది ఆవిడ.

"అన్నం వడ్డించనా?" అడిగింది.

"వద్దే, కాస మజ్జిగుంటే ఇవ్వు. చాలు"

తల్లి అందించిన గ్లాసు తీసుకుని ఓ గుటక వేసి చెప్పాడు చౌడేశ్వరరావు.

"నాకు ఆఫీసులో మెరిట్ సర్టిఫికేట్ వచ్చిందే"

"ఏమిటి?" అడిగింది ఆవిడ ఆశ్చర్యంగా.

"అవునే మెరిట్ సర్టిఫికెట్ ఇచ్చారు".